వికలాంగ పింఛనుకు ఈయన అర్హుడు కారా?

● ఆరేళ్లుగా ఎదురు చూపు
● రెండు నెలల కిందట వృద్ధాప్య పెన్షన్ మంజూరు


మంచంలోనే ఉంటున్న నాగరాజు

ఏర్పేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రెండు కాళ్లు లేవు. నడవలేరు. ఆరేళ్లుగా మంచానికే పరిమితమయ్యారు. అయినా, ఆయనకు వికలాంగ పింఛను రాలేదు. ఈ విషయంలో వైసీపీ ఐదేళ్ల వైసీపీ పాలనలో 'రాజకీయం' చోటుచేసుకుంది. ఇప్పుడేమో అధికారులు వృద్ధాప్య పింఛనుతో సరిపెట్టారు. ఈయన పేరు నాగరాజు. ఉండేది ఏర్పేడు మండలం రావిళ్లవారికండ్రిగ అరుంధతివాడ. ఆరేళ్ల క్రితం ఇన్ఫెక్షన్ సోకడంతో శస్త్రచికిత్స ద్వారా రెండు కాళ్లను తొలగించారు. అప్పట్నుంచి నెలకు రూ.10వేలు మందులకు ఖర్చవుతోంది. రెండు కాళ్లలేక ఏ పనీ చేయలేదక కుటుంబ సభ్యులపై ఆధారపడ్డారు. అప్పటి నుంచి వికలాంగ పింఛను కోసం కుటుంబ సభ్యుల సహకారంతో అధికారుల చుట్టూ తిరిగారు. టీడీపీ సానుభూతిపరుడని గత వైసీపీ పాలనలో ఆయనకు పింఛను రాకుండా అడ్డుకున్నారని సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ దరఖాస్తు చేశారు. మే నెలలో ఆయనకు వెంకటగిరిలోని సదరం క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించగా.. రెండు కాళ్ల లేవని 99 శాతం వికలత్వం ఉన్నట్లు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అయినా ఆయనకు వికలాంగ పింఛను రాలేదు. కానీ, రెండు నెలల కిందట వృద్ధాప్య పింఛను మంజూరైంది. దీనిపై ఆవేదనతో ఆయన తొలి నెల పింఛను తీసుకోలేదు. కానీ, మందుల ఖర్చు భరించలేని పరిస్థితుల్లో రెండో నెల పింఛను తీసుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వికలాంగ పింఛను అందిస్తే.. మందులకు ఊరటగా ఉంటుందని ఆయన అన్నారు.

ఇక రట్టు

ములకలచెరువులో కల్తీ మద్యం తీగ లాగితే.. రాష్ట్రమంతా కదిలింది. దీనిపై ప్రభుత్వం సిట్‌నూ వేసింది. అదే సమయంలో నకిలీ మద్యం గుట్టు విప్పడానికి ప్రభుత్వం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. బాటిల్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా అసలా.. నకిలీనా అనేది గుర్తించొచ్చు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి





● స్కాన్ చేయి.. వివరాలు తెలుసుకో
● అందుబాటులోకి ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్

కల్తీ మద్యంను రట్టు చేయడానికి ప్రభుత్వం 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను తీసుకొచ్చింది. దీనిని తిరుపతిలోని అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో బుధవారం సీఐ రామచంద్రతో కలిసి జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. ఈ యాప్‌ను ఎలా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. కల్తీ మద్యం అరికట్టేందుకు.. మరోవైపు లిక్కర్ షాపులు, బార్ల వద్ద నాణ్యమైన మద్యం విక్రయాలకు ఈ యాప్ దోహదపడనుంది. మద్యం బాటిల్ మీద వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతనే మద్యం విక్రయించాలి.

యాప్‌ను ఇలా వాడాలి

● సెల్‌ఫోనులోని ప్లే స్టోర్‌కు వెళ్లి 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● ఇన్‌స్టాల్ చేశాక రెండు ఎంపికలు కనిపిస్తాయి. ఒకటి వినియోగదారుల కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వాహకుల కోసం. ● వినియోగదారుడు ఐఎంల్ లిక్కర్ బాటిల్‌పై వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ఆ తర్వాత వెరిఫై ప్రొడక్టును ఎంపిక చేయగానే మద్యం బాటిల్‌పై ఉన్న బ్యాచ్ నెంబరు, ఎక్కడ తయారైంది? ఎటు నుంచి వచ్చింది? బ్రాండు పేరు, ధర వివరాలన్నీ స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. ఒకవేళ అది నకిలీ మద్యం అయితే 'డిటైల్స్ నాట్ ఫౌండ్' అని కనిపిస్తుంది. ● ఈ యాప్‌లోని సమాచారం జిల్లా క్రేందంలోని అధికారులకు, రాష్ట్ర స్థాయి అధికారుల డేటా బేస్‌కు వెళుతుంది.

ఇక, అబద్ధ ప్రచారం చేయలేరు



ఇకపై మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉందనే అపోహలు, వదంతులు సృష్టించలేరు. ప్రభుత్వం, డిపార్టుమెంటుపై అబద్ధాలు ప్రచారం చేసే అవకాశాలు ఉండవు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అసలు మద్యం కొనుగోలు చేయాలి. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవు.

- నాగమల్లేశ్వర రెడ్డి, ఎక్సైజ్ ఈఎస్

బ్యాంకు దోపిడీకి 'వెనుక' ప్లాన్

బ్యాంకు దోపిడీకి 'పక్క' ప్లాన్ వేశారు. ఈ భవనానికి.. వెనక గోడౌన్‌కు మధ్యలో ఉన్నది ఒకటే గోడ. దీంతో గోడౌన్‌లోకి చొరబడిన దుండగులు.. గోడకు కన్నం వేసి వేసి బ్యాంకులోకి దూరారు. చోరీకి విఫలయత్నం చేసి వెనుదిరిగారు.


గోడౌన్‌లో నుంచి బ్యాంకు గోడకు వేసిన కన్నం


పోలీసులు విడుదల చేసిన నిందితుల ఊహా చిత్రం


బ్యాంకులో విచారిస్తున్న పోలీసులు

● గోడౌన్‌లో నుంచి కన్నం వేసిన దుండగులు
● నాగలాపురం యూబీఐలో చోరీకి విఫలయత్నం

నాగలాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని యూనియన్ బ్యాంకుకు మంగళవారం రాత్రి కన్నం వేశారు. చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఈ విషయం బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యూనియన్ బ్యాంకుకు వెనుక వైపు సిమెంట్ గోడౌన్ ఉంది. ఇద్దరు దుండగులు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో సిమెంట్ గోడౌన్ షట్టర్‌ను ధ్వంసంచేసి లోనికి ప్రవేశించారు. గోడౌన్ లోపల నుంచి బ్యాంకు భవనం గోడకు మనిషి దూరే కన్నం వేశారు. లోపలకు వెళ్లిన వీరు ముందుగా సీసీ కెమెరాలను, అలారం సెట్‌ను తొలగించారు. సిమెంట్ గోడౌన్‌లో విద్యుత్ సరఫరా లేకపోయే సరికి బ్యాటరీ కటింగ్ మిషన్ ద్వారా కన్నం వేసినట్లు తెలుస్తోంది. బ్యాంకు లోపల లాకరును తెరిచేందుకు రాత్రంతా ప్రయత్నించారు. ఆ ప్రయత్నం సఫలం కాకపోవడం.. తెల్లవారుతుండడంతో దుండగులు వెనక్కి వచ్చారు. బ్యాంకు లోపల సీసీ టీవీ, డీవీఆర్ బాక్సులు, హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లారు. బుధవారం ఉదయం విధులకు వచ్చిన బ్యాంకు సిబ్బంది దీనిని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సత్యవేడు ఎస్‌ఐ రామస్వామి, టీఎస్‌ఐ ప్రసాద్ పరిసరాలను పరిశీలించారు. విచారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ చెప్పారు. ఘటన జరిగిన సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు నిందితుల చిత్రాలను పోలీసులు విడుదల చేశారు.

గతంలోనూ ఇదే తరహా చోరీలు

గతంలోనూ ఓ దొంగల ముఠా నాగలాపురంలో ఇదే తరహాలో చోరీకి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. బట్టల దుకాణం,నగల దుకాణం, ఏటీఎం కేంద్రాల్లో చోరీకి పాల్పడ్డారు. ప్రస్తుతం ఏకంగా బ్యాంకుకే కన్నం వేశారు.

రెవెన్యూ ఉద్యోగి సస్పెన్షన్


చంద్రశేఖర్ వెంకటేష్

● కల్తీ మద్యం అని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు
● ఎమ్మెల్సీ సిపాయి పీఏగా పనిచేస్తున్న వెంకటేష్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నకిలీ మద్యం అంటూ సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు పెట్టించిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్సీ పీఏ, రెవెన్యూ ఉద్యోగి చంద్రశేఖర్ వెంకటేష్ సస్పెండయ్యారు. ఇతడిపై కేసు నమోదవడంతో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. నారాయణవనం తహసీల్దారు కార్యాలయంలో చంద్రశేఖర్ వెంకటేష్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌పై వైసీపీ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం దగ్గర పీఏ (వ్యక్తిగత సహాయకుడు)గా చేరారు. ఈ నెల 7న కొంత మంది వైసీపీ సోషల్ మీడియా సభ్యులతో కలిసి 'తిరుపతిలో కల్తీ మద్యం కలకలం.. ప్రజల భద్రత ఎక్కడ', 'ఎన్ బ్రాండ్ మద్యం తాగి అపస్మారకస్థితిలో వ్యక్తి' అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేయించారు. ఎక్సైజ్ పోలీసుల ఫిర్యాదుతో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదుచేశారు. తప్పుడు పోస్టులతో అసత్య ప్రచారాలుచేసిన చంద్రశేఖర్ వెంకటేష్‌తో పాటు నవీన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 41ఏ నోటీసు ఇచ్చి పంపారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన చంద్రశేఖర్ వెంకటేష్ ఉద్దేశ్వపూర్వకంగా తప్పుడు ప్రచారంచేయడంతో చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు కలెక్టర్‌కు నివేదిక పంపారు. దీంతో ఆయన్న సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

గ్రావెల్ లేక ఆగిన 'సాగరమాల'

● నేడు కోటకు కలెక్టర్ రాక

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్ అందుబాటులో లేక కోట మండలంలో సాగరమాల రోడ్డు పనులు వారం రోజులుగా ఆగిపోయాయి. గ్రావెల్ క్వారీల రాయల్టీ నగదును ప్రభుత్వానికి చెల్లించే బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో కోట, చిల్లకూరు మండలాల్లో సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ సరఫరా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సాగరమాల ప్యాకేజీ 4లోని 31 కిలోమీటర్ల రోడ్డు పనులను గురువారం పరిశీలించనున్నారు. తమ్మినపట్నం, కొత్తపట్నంలోని క్రిస్ సిటీ పనులను కలెక్టర్ పరిశీలించి, ఆయా పనులకు అవసరమయ్యే గ్రావెల్ రవాణా అనుమతుల విషయమై మైనింగ్ అధికారులతో చర్చించనున్నట్లు మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లాకు హంద్రీ-నీవా జలాలు

● రూ. 126 కోట్లు మంజూరుచేస్తూ జీవో జారీ
● సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే నానీ కృతజ్ఞతలు

తిరుపతి/చంద్రగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి హంద్రీ-నీవా జలాలను మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.126.06 కోట్లు మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు ఏర్పాటు చేసిన నీవా బ్రాంచి కెనాల్ నుంచీ చంద్రగిరి, తిరుపతి, తిరుమల వరకూ నీటిని మళ్లించేందుకు జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఫిబ్రవరి 8, మార్చి 5వ తేదీల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.127 కోట్ల అంచనా వ్యయంతో చంద్రగిరి మండలం నారావారిపల్లి సమీపంలోని మూలపల్లి చెరువుకు, అక్కడి నుంచీ మరో నాలుగు చెరువుల మీదుగా కళ్యాణి డ్యామ్‌కు మళ్ళించేలా డిజైన్ రూపొందించారు. మార్గమధ్యంలో 1154 ఎకరాలకు సాగునీరందించడానికి కూడా ప్రతిపాదించారు. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడును పలుమార్లు కలిసి ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. దీంతో ఈ నెల 3న జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆమోదం లభించింది. తాజాగా జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సంబంధిత పనుల కోసం రూ.126.06 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'నా ఎన్నికల హామీని నెరవేర్చేందుకు సాయం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్నా' అని బుధవారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నానీ ఆంధ్రజ్యోతితో అన్నారు. మిగిలిన హామీలను నెరవేర్చేందుకూ కృషి చేస్తానన్నారు.

స్కూల్ బ్యాగ్‌లో మద్యం

● టీచర్లు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

చంద్రగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మద్యం తాగొచ్చిన విద్యార్థిని ఉపాధ్యాయులు మందలించగా.. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఎం.కొంగరవారిపల్లె ఉన్నత పాఠశాలలో సమీప గ్రామానికి చెందిన ఓ విద్యార్థి పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం ఇతడు మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పారు. అతడి స్కూల్ బ్యాగ్‌ను ఉపాధ్యాయులు తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు కనిపించడంతో హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆ విద్యార్థిని హెచ్‌ఎం మందలించి, పాఠశాలకు రావాలంటూ 11 గంటల సమయంలో అతడి తల్లితండ్రులకు సమాచారమిచ్చారు. ఇంతలో ఆ విద్యార్థి పాఠశాల ప్రహరీ దూకి పరారయ్యాడు. అతడి కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు చుట్టు పక్కల గాలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముంగిలిపట్టు సమీపంలో రైలు పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. అక్కడికి వెళ్లి పరిశీలించగా, చనిపోయింది ఆ విద్యార్థేనని నిర్ధారించారు. రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సర్క్యులర్ ఎకానమీ'పై విస్తృత ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య


● కాలుష్య నియంత్రణమండలి చైర్మన్ కృష్ణయ్య సూచన

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సర్క్యులర్ ఎకానమీపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య సూచించారు. రాష్ట్ర సర్క్యులర్ ఎకానమీ- వేస్ట్ రీసైక్లింగ్ పాలసీపై కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రతి వస్తువును వ్యర్థంగా కాకుండా వనరుగా చూడాలన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రీసైక్లింగ్ పాలసీని రూపొందించిందన్నారు. చికెన్, చేపల దుకాణాల్లో వచ్చే వ్యర్థాలను ఫిష్ మీల్, ప్రొటీన్ ఫీడ్‌గా, రొయ్యల వ్యర్థాల నుంచి కైటిన్ అనే విలువైన పదార్థం తీసి ఆరోగ్య ఉత్పత్తుల్లో వాడుతున్నారని వివరించారు. సర్క్యులర్ ఎకానమీ అంటే వ్యర్థమే అనేది ఉండకూడదని, ప్రతి వస్తువును తిరిగి వాడటమన్నారు. దాని వల్ల ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతాయన్నారు. ముఖ్యంగా వెటర్నరీ, అగ్రికల్చరల్ యూనివర్శిటీలలో పౌల్ట్రీవేస్ట్, వ్యవసాయ వ్యర్థాలపై పరిశోధన చేసి రైతులకు ఉపయోగపడే మోడల్స్‌ను సృష్టించాలన్నారు. శ్రీకాళహస్తి-నాయుడుపేట జాతీయ రహదారిలో పొయ్య వద్ద, వీసీఐసీ మార్గంలో సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్, నాగేశ్వరరాజు, డీపీవో సుశీలదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, ఆంధ్రజ్యోతి: తిరుమల శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గాన కోకిల జ్ఞాపకాల్లో....



హైదరాబాదులో బుధవారం కన్నుమూసిన తొలి తరం సినీ నటి, నేపథ్య గాయని రావు బాలసరస్వతికి తిరుపతితో మంచి అనుబంధమే వుంది.చెన్నైలో వున్నప్పుడు అనేకమార్లు తిరుపతికి వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు.వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ అనేక పాటలు పాడారు.వెంకటగిరి రాజవంశంలో పుట్టి తూర్పుగోదావరి జిల్లా కోలంక జమిందారు ఇంటికి దత్తు వెళ్లిన రావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావును 1944వ సంవత్సరంలో వివాహమాడారు.2007లో తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాలతో పాటు 2009లో శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరై సన్మానాలందుకున్నారు.రావు బాలసరస్వతి మృతి పట్ల వెంకటగిరి రాజ వంశీకుడు, గేయధారతో ప్రఖ్యాతుడైన సాయికృష్ణ యాచేంద్ర సంతాపం వ్యక్తం చేశారు.1950వ సంవత్సరంలో వెంకటగిరిలో జరిగిన తన గేయదార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారని గుర్తు చేసుకున్నారు.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఆంధ్రజ్యోతి


శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలలో రావు బాలసరస్వతిని సన్మానిస్తున్న నాటి తెలుగు అధ్యాపకుడు సాకం నాగరాజ


తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాల్లో రావు బాలసరస్వతి

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

రామచంద్రాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎస్‌ఐ భక్తవత్సలం హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లైసెన్సు కలిగిన వారు మాత్రమే బాణసంచా విక్రయించాలన్నారు. బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత మత్తుపదార్థాలను సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టపాకాయల దుకాణాల మధ్య దూరం పాటించాలన్నారు.

పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ



తిరుపతిరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ గ్రామ పంచాయతీల్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సిబ్బందికి బుధవారం యూనిఫాం, సోపులు, నూనె, డెటాల్, స్వీట్స్, టపాసుల బాక్సును సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. వాహనాలకు ఆయుధపూజ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగమణి, బిల్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ చేస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు, పక్కన సెక్రటరీ నాగమణి

ఘనంగా వరల్డ్ స్టూడెంట్స్ డే

తిరుపతిరూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అడల్ట్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం వేదాంతపురం పంచాయతీ విజయనగర్‌కాలనీలోని డాక్టర్ ఆర్వీరెడ్డి డిగ్రీ కళాశాలలో వరల్డ్ స్టూడెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆ విభాగ ప్రొఫెసర్లు శ్యాంమోహన్ డేవిడ్, సత్యవతి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్వీరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చదువుతోపాటు అధునాతన సాంకేతికత, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహారోత్పత్తిలో మహిళా రైతులే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు భాగ్యలక్ష్మి

భాకరాపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తిలో మహిళా రైతులది కీలక పాత్ర అని చిన్నగొట్టిగల్లు తహసీల్దారు భాగ్యలక్ష్మి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం 'విస్' సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ మహిళా రైతు దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆహార, పోషక ఆహార భద్రతను నిర్ధారించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసే మహిళలకు ప్రోత్సాహకాలు అందివ్వాలన్నారు. విస్ సంస్థ డైరెక్టర్ మీరా రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామీణ మహిళా రైతులకు భూమి, అడవులు, నీరు వంటి ఉత్పత్తి హక్కులు కల్పించాలన్నారు. అనంతరం భూమిలేని పేద మహిళా రైతులు వ్యవసాయ భూమి ఇప్పించాలని తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి స్రవంతి, సూపరింటెండెంట్ సతీశ్‌కుమార్, ఏఈవో పురుషోత్తం, విస్ సంస్థ మండల కో-ఆర్డినేటర్ రహంతుల్లా, సిబ్బంది హరిబాబు, నీరజ, శకుంతల, చంద్రిక, దేవకీదేవి, ఈశ్వరమ్మ, కమలమ్మ, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

పాకాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు కోరారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం ఆనందగిరి పరిసరాలలో సీడ్ బాల్స్ చల్లారు. సుమారు 2వేల సీడ్ బాల్స్ (వివిధ రకాల విత్తనాల ఉండలు) చల్లారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేఎస్ తులసీరామన్, రీజనల్ ఛైర్ పర్సన్ వి.రామయ్య, అధ్యాపకులు రమేష్ నాయుడు, రూపేష్, రెడ్డిప్రతాప్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మామిడి రైతులు

పాకాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని మామిడి రైతులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. తోతాపురి మామిడికాయలకు కనీస మద్దతు ధర కేజీకి 4 రూపాయలు ప్రకటించి, అకౌంట్‌లలో జమ చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పాలమిత్రలకు మిక్సీల పంపిణీ



పాకాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లవారిపల్లె శ్రీజ బీఎంసీ పరిధిలోని పాలమిత్రలకు బుధవారం దీపావళి కానుకగా మిక్సీలు పంపిణీ చేశారు. శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. జైకా సంస్థ సహకారంతో గ్రామ మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రకాష్, పీటీఐ అధికారి నిరోష, సూపర్‌వైజర్ జీవన్‌కుమార్ రెడ్డి, మోతీసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ డానియెలీ పరిశ్రమకు పలు అవార్డులు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

సత్యవేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ కన్వర్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (సీఓఓ) పోటీల్లో అత్యున్నత నాణ్యత పనితీరుకు గాను శ్రీసిటీలోని డానియెలీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్, సిల్వర్ అవార్డులను గెలుచుకుంది. విశిష్ట నాయకత్వ ప్రతిభకు గాను డానియెలీ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు ట్రాన్స్‌ఫర్మేషనల్ లీడర్ షిప్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన సామర్థ్యం, దార్శనికత, నాయకత్వ లక్షణాలకు ఈ అవార్డు వరించింది. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఇది శ్రీసిటీకి గర్వ కారణమని వ్యాఖ్యానించారు. డానియెలీ సిబ్బంది, యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇటలీకి చెందిన డానియెలీ పరిశ్రమ నాణ్యతతో కూడిన స్టీల్ ప్లాంటు మెషినరీ, రోలింగ్ మిల్స్ వంటి పరికరాలను తయారు చేస్తోంది.

నాయీ బ్రాహ్మణుల సమావేశం

తిరుపతి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటోందని కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. బుధవారం కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని సదాశివం అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సురవరపు నాగరాజు, లంక రత్న, కడియాల కొండన్న, నూకరాజు, కుర్తి రమేష్, యానాపు యేసు, టీడీపీ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు వైద్యం శాంతారామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సమస్యలపై చర్చించారు.

వెటర్నరీలో నూతన ఆఫీసర్లకు అభినందన

తిరుపతిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నూతన ఆఫీసర్లుగా బాధ్యతలు చేపట్టిన డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఎస్‌ఏ వి.వైకుంఠరావులను ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో బుధవారం పలువురు విద్యార్థి నాయకులు మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు, రాయలసీమ విభాగం అధ్యక్షుడు విజయ్, గిరినాయక్, ముస్తఫా, చిద్విలాస్, పార్థసారథి, ధనంజయులు, మధు పాల్గొన్నారు.

రేపు పాకాలలో పింక్ బస్సు సేవలు

పాకాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం పింక్ బస్సు క్యాంపు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పింక్ బస్‌లో మహిళలు, పురుషులకు నోటి, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. హాజరయ్యేవారు ఆధార్ కార్డ్, ఫోన్ నంబరుతో రావాలని కోరారు.

21న దీపావళి సెలవుగా ప్రకటించాలి

తిరుపతిరూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 20, 21 తేదీలను సెలవులుగా ప్రకటించాలని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. పిల్లలు విశేషంగా జరుపుకునే నరక చతుర్దశిని రాష్ట్ర ప్రభుత్వం సెలవులో పొందుపరచకపోవడం సరికాదని తెలిపారు. అశ్వయుజ అమావాస్య 20న మధ్యాహ్నం 2.30గంటలకు ప్రారంభమై 21వరకు ఉంటుందని, దీంతో ప్రజలు అమావాస్య సూర్యోదయం తర్వాత లక్ష్మీ పూజ జరుపుకుంటారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 21వ తేదీని దీపావళి సెలవుగా అధికారికంగా ప్రకటించాలని విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు విన్నవించినట్లు వివరించారు.

ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ ప్రారంభించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఏపీఐఐసీ పార్టనర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముందుకు సాగాలన్నారు. దీనికోసం అక్టోబరు 15 నుంచి నవంబరు 15వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. పరిశ్రమలలో మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, పెట్టుబడులు, శుభ్రత, పారిశుద్ధ్య డ్రైవ్, మొక్కలు నాటే కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజరు చరణ్ రుద్రరాజు, నాగమల్లయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భర్త, పనిమనిషి కిడ్నాప్

● తిరుచానూరుకు వెళ్లి రక్షించిన పోలీసులు

కదిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భర్తను, ఆ ఇంటి పనిమనిషిని కిడ్నాప్ చేశారామె. ఆమె నుంచి వారిని పోలీసులు రక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు.. కదిరి ఎన్‌జీవో కాలనీకి చెందిన ప్రవీణ్‌ను, పనిమనిషి చైతన్యను మంజుల (ప్రవీణ్ భార్య) ఈ నెల 13న కిడ్నాప్ చేశారు. తిరుపతి జిల్లా తిరుచానూరులో మంజుల కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అక్కడ్నుంచి రెండు కార్లలో సుమారు 18 మందితో కలిసి కదిరికి వచ్చిన తన భర్తను, పనిమనిషిని బలవంతంగా వాహనాల్లో తీసుకెళ్లారు. అడ్డువచ్చిన ప్రవీణ్ తల్లిదండ్రులను చితకబాదారు. దీంతో ప్రవీణ్ తల్లి వెంకటరమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన కదిరి పోలీసులు, కిడ్నాప్ అయిన ఇద్దరినీ రక్షించారు. ఈ నెల 14న కదిరికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కదిరి మండలం కాలసముద్రం రైల్వేస్టేషన్‌లో పాయింట్స్‌మన్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌తో మంజులకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ప్రవీణ్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆయన భార్య అపహరించారని సమాచారం. మహిళా కానిస్టేబుల్‌పై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి ఎస్వీయూలో యువ తరంగ్



రిహార్సల్ చేస్తున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో గురువారం నుంచి మూడు రోజులపాటు యువ తరంగ్-2025 కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికోసం వేదికలు ముస్తాబయ్యాయి. సంగీత, నృత్య సంబంధమైన సుమారు 30 అంశాల్లో పోటీలు ఉంటాయి. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచీ 40 కళా బృందాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. వివిధ రకాల కళా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు తమిళనాడులోని హిందూస్థాన్ యూనివర్సిటీలో చేపట్టే జోనల్ పోటీల్లోనూ, అందులో విజేతలను సత్యభామ యూనివర్సిటీలో చేపట్టే జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొనే అవకాశం ఏర్పడుతుంది. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో యువ తరంగ్ ప్రారంభమవుతుందని స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

రవికుమార్ ఆస్తుల స్వాధీనంలో కుట్ర కోణం

● విచారణ బృందంలో నాటి అధికారులను తప్పించాలి ● టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో రూ.72వేలతో రవికుమార్ పట్టుబడ్డాడు. కానీ, అతడి నుంచి రూ.14కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. దీని వెనుక కుట్ర కోణం కనిపిస్తోంది' అని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన బీజేపీ నాయకులు అజయ్‌కుమార్, వరప్రసాద్, భాస్కర్, జీవన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించి పరకామణి కేసు వ్యవహారంలో తీసుకున్న నిర్ణయాలు అనుమానాలకు తావిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసులో రవికుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా లోక్‌అదాలత్‌లో రాజీ చేసి అతడి నుంచి ఆస్తులు రాయించుకోవడం వెనుక రహస్యం దాగుందన్నారు. తన స్థిరాస్తులు టీటీడీ స్వీకరించాలని రవికుమార్ లేఖ రాయడం.. స్వాధీనానికి తీర్మానం చేసిన బోర్డు సమావేశానికి నెల రోజుల వ్యవధి ఉన్నా అభ్యంతరాలపై పత్రికా ప్రకటన ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. అందుకు సమయం లేదంటూ నాటి బోర్డు సమావేశంలో పేర్కొనడం చూస్తుంటే రేకెత్తుతున్న అనుమానాలకు బలాన్నిస్తోందని చెప్పారు. తానెప్పుడూ ఇలాంటి తీర్మానాలు చూడలేదన్నారు. టీటీడీ న్యాయ నిపుణులు అన్నీ పరిశీలిస్తున్నారని, నిబంధనల అతిక్రమణలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కేసు విచారణ బృందంలో నాడు టీటీడీలో పనిచేసి కేసు పూర్వాపరాలు పరిశీలించిన అధికారులు ఉండడాన్ని ఆక్షేపించారు. వెంటనే ఈ బృందం నుంచి వారిని తప్పించాలని ఆయన డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

తప్పుడు ప్రచారాలపై కఠిన చర్యలు

● పోలీసు శాఖ హెచ్చరిక ● వదంతులు నమ్మొద్దంటూ ప్రజలకు సూచన

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి, ప్రజల్లో భయాందోళనలు కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుశాఖ హెచ్చరించింది.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.తప్పుడు సమాచారం, వదంతులత ప్రజల్లో అయోమయం సృష్టించడం బాధ్యతారాహిత్యమైన చర్య అని పేర్కొంది. ఇలాంటి వాటిని నమ్మొద్దని, నిజమైన సమాచారం కోసం పోలీస్ సోషల్ మీడియా పేజీ చూడాలని కోరింది. 'మద్యం మత్తులో ఉన్న వ్యక్తి తిరుపతి ఏడు కొండల బస్టాండు వద్ద యాత్రికులను భయభ్రాంతులకు గురి చేశాడంటూ సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. దీనిపై విచారించాం.ఆ వీడియో ఏడు కొండల బస్టాండుది కాదు. మంగళవారం సాయంత్రం పూర్ణకుంభం సర్కిల్ సమీపంలోని ప్రైవేటు బస్సులు ఆగే ప్రదేశంలో చిత్రీకరించిందని తేలింది. ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో పనిచేసే క్లీనర్ నాగరాజు నిద్రపోతుండగా, అతడి సెల్‌ఫోనును దొంగిలించడానికి సెల్వం మహేష్ (నాగూర్‌వాసి) ప్రయత్నించాడు. అక్కడున్న ఆటో డ్రైవర్లు స్పందించి అతడిని పోలీసులకు అప్పగించారు.ఆ సమయంలో అతడు మద్యం మత్తులో లేడు.ఈ ఘటనపై ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదై, దర్యాప్తు కొనసాగుతోంది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు వీడియోలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న లలితకుమారి

చంద్రగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మండల విద్యాధికారిణి లలిత కుమారి అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి ఎంఈవో లలితకుమారి, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య, ఇంపాక్ట్ రీజినల్ క్లబ్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం, విద్యార్థినులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అత్యంత సామాన్య కుటుంబం నుంచి జీవితాన్ని ప్రారంభించి. దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతోపాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్‌గా గుర్తింపు పొందిన కలాం జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. పైడి అంకయ్య మాట్లాడుతూ కలాం ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రత్యేకంగా పాఠశాలలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇంపాక్ట్ ట్రైనర్ మాధవి, నల్లం నరేంద్ర పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చంద్రగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింగాపురం సమీపంలో రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. మంగళవారం సాయంత్రం 60 నుంచి 70 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చంద్రగిరి రైల్వేస్టేషన్ సమీపంలో మృతి చెందాడని సమాచారం అందడంతో చిత్తూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 60 నుంచి 70ఏళ్ల ఉంటుందని, తీవ్ర గాయాలతో రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్నాడని, తెలుపు రంగుపై ఎరుపు, బులుగు గీతలు ఉన్న చొక్కా, ఎర్రని డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. పూర్తి వివరాలు తెలిసిన వారు 8688546060ను సంప్రదించాలని తెలిపారు.

జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్‌పై శిక్షణ

చంద్రగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 22వ తేదీ నుంచి 35 రోజుల పాటు మహిళలకు ఉచితంగా జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు అర్హులని తెలిపారు. పదో తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని కోరారు.

ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్‌లో ఎడిఫైకి అగ్రస్థానం



అవార్డు స్వీకరిస్తున్న డైరెక్టర్ ప్రణీత్

తిరుచానూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్స్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నట్లు ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ బుధవారం తెలిపారు. రాష్ట్రంలో ఎడిఫై స్కూల్ రెండవ ర్యాంకు, తిరుపతి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. విద్య, నైపుణ్యం, సమగ్ర విద్య పట్ల తమ పాఠశాలకు ఉన్న నిబద్ధతకు ఈ అవార్డులు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే డిజైన్ థింకింగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ లెర్నింగ్ లీడర్ విభాగంలో తమ పాఠశాల జాతీయ స్థాయిలో 5వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను కేవలం పరీక్షలకే కాకుండా జీవితానికి సిద్ధంచేసే ప్రగతిశీల పాఠ్య ప్రణాళికను అందించడమే తమ లక్ష్యమన్నారు.

భక్తురాలిపై దాడి ఘటనలో జమేదారుపై బదిలీ వేటు

తిరుచానూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన భక్తురాలు ఆండాలు(హిజ్రా) కుటుంబ సభ్యులతో కలిసి తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చారు. అమ్మవారి ఆలయ సన్నిధి వద్ద విజిలెన్సు మహిళా జమేదారు అలివేలు ఆమెపై చేయి చేసుకున్నారు. దీనిపై జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ బుధవారం నివేదిక తెప్పించుకున్నారు. మహిళా జమేదారు అలివేలును తక్షణమే సెక్టార్ 5 అలిపిరికి బదిలీ చేసినట్లు టీటీడీ ముఖ్య నిఘా భద్రతాధికారి(సీవీఎస్వో) మురళీకృష్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు. గతంలోనూ ఆమె పలుమార్లు భక్తులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. అప్పుడు కూడా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అమ్మవారి ఆలయ నుంచి బదిలీ చేయగా ఓ విజిలెన్సు అధికారి సహకారంతో తిరిగి ఇదే ఆలయానికి వచ్చారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సంఘమిత్రలు

తిరుపతిరూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల వెలుగు సమాఖ్య కార్యాలయం వద్ద మండల సంఘమిత్ర(వీవోఏ)ల ఆధ్వర్యంలో బుధవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంఘమిత్రల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దును హర్షిస్తూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తమకు మూడేళ్ల కాల పరిమితితో జీవోను అమలులోకి తెచ్చారని, పలుమార్లు దీన్ని రద్దు చేయాలని కోరినా పట్టించుకోలేదని అన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దుచేయడమే కాకుండా, 5జీ మొబైల్స్ ఇస్తామని హామీ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ డిమాండ్లకు స్పందించిన సీఎం, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీఈవోకి కృతజ్ఞతలు తెలిపారు.


15 ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రావారిపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి); భాకరాపేట ఫారెస్టు రేంజ్ పరిధిలో కూంబింగ్ నిర్వహించి 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో వెంకటరమణ తెలిపారు. ఎర్రావారిపాళెం మండలం బోడేవాండ్లపల్లె సమీపంలో టవేర వాహనంలో ఎర్రచందనం తరలిస్తుండగా అందిన రహస్య సమాచారం మేరకు ఫారెస్టు సిబ్బంది దాడి చేసి వాహనంతోపాటు 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ సమీపం వలసారెడ్డిగారి పల్లె వద్ద వ్యానులో తరలిస్తున్న 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండుచోట్ల దొరికిన దుంగల బరువు 480 కేజీలు ఉంటుందని, సుమారు రూ.25 లక్షలు చేస్తాయని చెప్పారు.

'పేటశ్రీ' తిరుపతి కథలకు' తెలుగువర్సిటీ పురస్కారం





పేట శ్రీనివాసులురెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పేట శ్రీనివాసులురెడ్డి రాసిన 'తిరుపతి కథలు' పుస్తకానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఏటా ఈ అవార్డులను ప్రకటిస్తారు. 2023 సంవత్సరానికి గాను వచనరచనల విభాగంలో పేట శ్రీనివాసులు రెడ్డికి ఈ పురస్కారం లభించింది. ఈ నెల 29వ తేదీన హైదరాబాదు నాంపల్లిలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు. ఎస్వీయూ తెలుగు విభాగం రిటైర్డు ప్రొఫెసర్ అయిన ఈయన 2014లోనూ తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఇప్పటికే 20 పురస్కారాలను అందుకున్న పేటశ్రీ 25 పుస్తకాలు, 300 వ్యాసాలు రాశారు. 10 దేశాల సదస్సుల్లో పాల్గొన్నారు.

షర్మిలా..విమర్శలు కాదు విజన్ కావాలి

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశానికి, ప్రజలకు మంచిచేసే ప్రభుత్వాలను విమర్శించడం కాదు... విజన్ కావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు హితవు పలికారు. బీజేపీ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదంటూ ప్రధాని మోదీని విమర్శించడాన్ని ఖండిస్తూ ఆయన బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీఎస్టీ 2.0 సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే ప్రగతిశీల నిర్ణయమని పేర్కొన్నారు. మోదీ ట్యాక్స్ విధానాన్ని గబ్బర్‌సింగ్ ట్యాక్స్ అని విమర్శించడం అజ్ఞానమని విమర్శించారు. గత జీఎస్టీ విధానం ద్వారా వసూలు చేసిన మొత్తం ఏమైందని షర్మిళ ప్రశ్నించడాన్ని గుర్తుచేస్తూ అది మళ్లీ రాష్ట్రాలకు అభివృద్ధి నిధుల రూపంలో వెళ్తోందన్న కనీస పరిజ్ఞానం లేదా అని ప్రశ్నించారు. 2014లో ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. దేశంలో తొలి ఏఐ హబ్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం హ్యాండ్ వాషింగ్ డే పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, విజయవాహిని చారిటబుల్ నిర్వాహకులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ చట్టం అమలు చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దేశభక్తుల ఐక్యవేదిక సభ్యులు

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉద్యోగ చట్టం అమలు చేయాలని భారతీయ దేశభక్తుల ఐక్యవేదిక అధ్యక్షుడు, న్యాయవాది పోతులూరి మాసుమయ్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ చట్టం ద్వారా ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఆర్జేడీ పార్టీ అధినేత తేజస్వీయాదవ్ బిహార్ ఎన్నికల సందర్భంగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. మిగిలిన రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కూడా ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. తేజస్వీయాదవ్ నిర్ణయానికి మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు సుధాకర్, విక్రమ్ రాథోడ్, రాజు, సౌందర్య నాయక్ పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతిని జయప్రదం చేయండి



మీడియాతో మాట్లాడుతున్న బుజ్జిబాబు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఈనెల 18వ తేదీన నిర్వహించే ధన్వంతరి జయంతిని జయప్రదం చేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జిబాబు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆ రోజున గాంధీరోడ్డులోని భజన మందిరం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణ మేధావులు, విద్యావంతులు, సంగీత కళాకారులు, సెలూన్ షాప్ యజమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మునిశేఖర్, శ్రీనివాస్, సూర్యప్రకాష్, జనార్దన్, గోకుల్, వెంకటరమణ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో కార్గో సేవలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 2026 నూతన సంవత్సరం సందర్భంగా తక్కువ ఖర్చుతో కార్గో సేవలు అందించనున్నట్లు కమర్షియల్ ఏటీఎం నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి, నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాల్లో టీటీడీ డైరీలు, క్యాలెండర్లు, స్వీటెంల, తిరుమల లడ్డూ ప్రసాదాలు అనతికాలంలో చేరవేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అబ్దుల్ కలాం ఆదర్శం కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిరాడంబరత, దేశంపట్ల అంకితభావం విద్యార్థులకు ఆదర్శం కావాలని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి అన్నారు. అబ్దుల్‌కలాం జయంతి ఉత్సవం స్థానిక కరకంబాడి మార్గంలోని స్ప్రింగ్‌డేల్ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తుడా చైర్మన్‌తో పాటు మహిళా వర్సిటీ వీసీ ఉమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన కలాం సాధించిన విజయాలను వివరించారు. వీసీ ఉమా మాట్లాడుతూ కలాం కోరుకున్న విధంగా విజ్ఞానం కోసం తపన, ఆత్మవిశ్వాసం, నిజాయితీతో కూడిన సమగ్రత అనే మూడు ముఖ్య మంత్రాలను విద్యార్థులు పాటించాలని సూచించారు. విద్యార్థులు కలాం మాస్కులు ధరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిటీ ఛాంబర్ అధ్యక్షుడు ఆయుబ్ ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి వై.షణ్ముగం, స్ప్రింగ్‌డేల్ అధినేత కేఎస్ వాసు, స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ, సాంబశివారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్లు కరుణానిధి, స్వరాజ్యలక్ష్మి, స్టాన్లీ జయకుమార్ పాల్గొన్నారు.

జయరాం రెడ్డికి సన్మానం



జయరాంరెడ్డిని సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కనీస వేతనాల డైరెక్టర్‌గా ఎన్నికైన జయరాంరెడ్డిని తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, జగ్గా, రవితేజ నాయుడు, గంజి సుధాకర్ రెడ్డి, రమణ, హేమంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి హోంగార్డు విభాగంలో పనిచేస్తున్న సునీల్‌కుమార్(44) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ కార్యాలయంలో ఆయన హోంగార్డుగా పనిచేస్తున్నాడు. విభాగంలో 21ఏళ్లుగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణ కోసం తిరుమలకు వెళుతుండగా మార్గమధ్యంలో గుండెపోటు వచ్చింది. మార్గంలో వెళుతున్న వారు గమనించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతని స్వగ్రామం చిత్తూరు సమీపంలోని చెర్లోపల్లికి పంపారు. అతని మృతి పట్ల తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, హోంగార్డులు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

సంస్కృత వర్సిటీ విద్యార్థికి వేదాంతరత్న బిరుదు



బిరుదు స్వీకరిస్తున్న వరదరాజన్‌శర్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీ అద్వైత వేదాంత విద్యార్థి వరదరాజన్ శర్మకు కంచి కామకోటి అద్వైత వేదాంత రత్న బిరుదును ప్రదానం చేసింది. తెనాలి పరీక్షలో ఉత్తీర్ణత సాధించినందుకు కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఈ బిరుదు ఇచ్చారు. వీసీ కృష్ణమూర్తి, వేదాంత విభాగాధ్యక్షులు గణపతిభట్, అధ్యాపకులు అభినందించారు.

తిరుపతి

కడుపుబ్బ నవ్వించే 'కె-ర్యాంప్'

యువనటుడు కిరణ్ అబ్బవరం



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

తిరుపతి అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కడుపుబ్బ నవ్వించేలా కెర్యాంప్ సినిమా తీశామని యువనటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా బుధవారం రాత్రి దర్శకుడు నానితో కలసి ఆయన ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. సినిమా ఈ నెల 18న విడుదల కానుందని, కుటుంబ సమేతంగా థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ ఆదరణ పొందాయన్నారు. తన సినిమాలను గొప్పగా ఆదరిస్తున్న తిరుపతి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. తదుపరి చెన్నై లవ్‌స్టోరీ, తిమ్మరాజుపల్లె టీవీ, మరో మూడు సినిమాలు చేస్తున్నానని చెప్పారు. పైరసీని నిషేధించాలని కోరారు. అనంతరం కాసేపు అభిమానులతో ముచ్చటించారు. యువకులు ఆయనతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు



తిరుపతి(విద్య), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన అవ్వరు శ్రీనివాసులు ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఏపీ ఎన్జీవో జనరల్ సెక్రటరీ డీవీ రమణ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్జీవో హోంలో జరిగింది. 11 ఉమ్మడి జిల్లాల నుంచి ఇంటర్ విద్య బోధన, బోధనేతర సిబ్బంది ఎన్నికల్లో పాల్గొన్నారు. అవ్వరు శ్రీనివాసులు రాష్ట్ర అధ్యక్షుడిగా విజయం సాధించారు.

18న బీజేపీ సంజీవనీ స్వరం

- హాజరుకానున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి జయంతి సందర్భంగా సంజీవనీ స్వరం కార్యక్రమాన్ని ఈనెల 18న తిరుపతిలో ఘనంగా నిర్వహించనున్నట్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూధన్ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో జరుగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక గాంధీ భవన్ నుంచి బాలాజీ కాలనీలోని జ్యోతీరావ్ పూలే విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందని, ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతుందని వివరించారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన వృద్ధుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. సుమారు 65 ఏళ్ల వ్యక్తి తెల్లపంచె, తెల్లచొక్కా ధరించి స్థానిక వివేకానంద సర్కిల్ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లేవు. స్థానికుల సమాచారం మేరకు వెస్ట్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐటీయూ జిల్లా నూతన కార్యవర్గం





ఎస్.జయచంద్ర - టి.సుబ్రమణ్యం

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర నాయకులు నరసింగరావు, అజేయ్‌కుమార్ లు వెల్లడించారు. అధ్యక్షుడిగా ఎస్.జయచంద్ర, ప్రధాన కార్యదర్శిగా టి.సుబ్రమణ్యం, కోశాధికారిగా ఇ.ఎస్.కుమార్ ఎన్నికయ్యారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా 10 మంది, కార్యదర్శులుగా 10 మంది, 35 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెల్లడించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 33 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 33 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు న్యాయస్థానం జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వీరిపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

'రెవెన్యూ ఆలయాన్ని' పరిశీలించిన కిరణ్‌రాయల్



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పదంగా మారిన తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన లక్ష్మీపద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని జనసేన నేత కిరణరాయల్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. మీడియాతో మాట్లాడుతూ 2016లో తహసీల్దార్‌గా ఉన్న అధికారి ప్రభుత్వ భూమి, రోడ్లను ఆక్రమించి ఈ గుడిని నిర్మించారని తెలిపారు. గుడిపేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనుమతి ఉందో లేదో తనకు తెలియదన్నారు. ఈ ఆలయ ట్రస్టుపై అనుమానాలున్నాయని, దీన్ని టీటీడీ లేక ఎండోమెంట్‌కు అప్పగించాలని కోరారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

హెచ్‌డీఎస్ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్- రూ.రెండు కోట్లతో రుయాస్పత్రి అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రికి వచ్చే రోగులకు కార్పొరేటుకు దీటుగా వైద్య సేవలు అందించాలని హెచ్‌డీఎస్(ఆస్పత్రి అభివృద్ధి కమిటీ) చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. స్థానిక ఎస్వీ వైద్య కళాశాలలోని సమావేశ మందిరంలో ఆయన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలిసి బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. రుయా, ప్రసూతి ఆస్పత్రుల అభివృద్ధికి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన పలు కీలక నిర్ణయాలను కమిటీలో తీర్మానాలు చేసి, ఆమోదించారు. పోస్ట్ ఆపరేటివ్ వార్డులో కురుస్తున్న వర్షపు నీటిని అరికట్టేందుకు రూ.16.60 లక్షలు, టీబీ, సీడీ వార్డుల మరమ్మతులకు రూ.4 లక్షలు, నూతన విభాగాల మరమ్మతులకు రూ.10 లక్షలు, ఓటీ గది మరమ్మతులకు రూ.2 లక్షలు, అత్యవసర విభాగంలో సెంట్రల్ ఏసీ ఏర్పాటుకు రూ.11.5 లక్షలు వెచ్చించాలని నిర్ణయించారు. అలాగే మూడు అనస్థీషియా వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు రూ.45 లక్షలు, ఐదు వెంటిలేటర్ల కొనుగోలుకు రూ.15 లక్షలు, చిన్నపిల్లల వార్డులో మల్టీ ఛానల్ యూపీఎస్ ఏర్పాటుకు రూ.24.50 లక్షలు వెచ్చించేందుకు నిర్ణయించారు. అలాగే ప్రసూతి ఆస్పత్రి బయట రోగుల సహాయకులు కూర్చునేందుకు కుర్చీలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు, ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్ల నిర్మాణానికి, డంపింగ్‌యార్డు నిర్మాణం, ఆస్పత్రి ఆవరణలో టీటీడీ, ఇతర దాతలు పెట్టే భోజనం కోసం వేచివుండే వారి కోసం ప్రత్యేక షెడ్లు, ఆస్పత్రికి ఇరువైపులా ఐరన్ గేట్ల ఏర్పాటుకు, స్ట్రెచర్ల కొనుగోలుకు మిగిలిన నిధులు కేటాయించాలని తీర్మానించారు. అలాగే రూ.23.57 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఈ ఏడాది డిసెంబరు 31 లోపు పూర్తి చేయాలని ఏపీఎంఐడీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది సమన్వయంతో రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాధ, ప్రమీల, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు కరణం సందీప్, ఖాజా మోహిద్దీన్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు కొత్త వాహనాలు

ఘనంగా ఆయుధ పూజ



ఆయుధపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

తిరుపతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థకు కొత్త వాహనాలు వచ్చాయి. 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.3కోట్లతో రోడ్ రిపేర్ మిషన్, లాడర్, ఇంటింటి చెత్త సేకరణకు వినియోగించేందుకు 4 ఆటోలను కొనుగోలు చేశారు. వాటికి కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయుధపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ నారాయణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, అధికారులు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్ తదితరులు పాల్గొన్నారు.







లోతట్టు ప్రాంతాల్లో చేరిన నీరు

తిరుపతిలో వర్షం

తిరుపతి అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం వేకువజామున వర్షం కురిసింది. పురవీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండు, కూరగాయల మార్కెట్ చిత్తడిగా మారిపోయాయి. ఉదయాత్పూర్వం వాకింగ్ చేసేవారికి ఆటంకం కలిగింది. వాతావరణం చల్లబడింది. శేషాచలం కొండపై పొగమంచు అలుముకుని కనువిందు చేసింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు, తమిళనాడు ఎమ్మెల్యే రాధాకృష్ణన్, కదంబుర్ రాజు, సినీ నిర్మాత బన్నీ వాసు, పుదుచ్చేరి ప్రభుత్వ విప్ ఏకేడీ ఆర్ముగం ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలేశుని సేవలో కనియూర్ మఠాధిపతి



ఉడిపి కనియూరు మఠాధిపతి విద్యావల్లభ తీర్థ స్వామిజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్ద స్వామిజీకి ఆలయ అర్చక బృందం, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మూలవిరాట్టును దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలి

- వైసీపీ నాయకుల డిమాండ్



ధర్నాలో పెద్దిరెడ్డి, భూమన తదితరులు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి చాటుకోవాలని మాజీ మంత్రి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. తిరుపతిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కిందిస్థాయి కార్యకర్తలతో ప్రభుత్వాన్ని నడిపేలా జగన్‌మోహన్‌రెడ్డి సందేశం ఇచ్చారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి జగన్, పెద్దిరెడ్డే అంతా చేశారని తాను సిట్ విచారణలో చెప్పలేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. భూమన నివాసం వద్ద రోడ్డుపై బైఠాయించి మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలంటూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలోనూ ప్రభుత్వంపై పెద్దిరెడ్డి, భూమన విమర్శలు చేశారు. టీడీపీలో తమకెవరూ కోవర్టులు లేరని చెప్పారు.

నెరబైలు పంచాయతీ కార్యదర్శి తీరుపై నివేదిక పంపండి

ఎంపీడీవోకు కలెక్టర్ ఆదేశం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరబైలు గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లెబ్బ దురుసు ప్రవర్తనపై విచారించి నివేదిక పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజల పట్ల కార్యదర్శి దురుసుగా ప్రవర్తిస్తున్నా రని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని, కఠినంగా మాట్లాడుతున్నారని గ్రామానికి చెందిన గండికోట శ్రీకాంత్‌తోపాటు మరో ఇద్దరు పీజీఆర్‌ఎస్‌లో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆయన సహచర ఉద్యోగులతోనూ గొడవపడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన చోటా ఇదే రకమైన ఆరోపణలున్నాయని తెలిపారు. రెండు రోజుల్లో విచారించి నివేదిక పంపనున్నట్లు ఇన్ చార్జి ఎంపీడీవో మదన్‌మోహన్‌రాజు తెలిపారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ స్పెషలాఫీసర్ పదవీకాలం పొడిగింపు

తిరుపతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపాలిటీ స్పెషలాఫీసర్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరగని కారణంగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి అక్కడి ఆర్డీవోను స్పెషలాఫీసర్‌గా నియమించింది ప్రభుత్వం. చివరగా ఈ ఏడాది జనవరి 29న ప్రభుత్వం స్పెషలాఫీసర్ పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించింది. ఆ గడువు గత జూలై 18వ తేదీన ముగిసింది. దీంతో ఎస్వో పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని కోరుతూ గత నెల 20న మున్సిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దానిపై స్పందించిన మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ గత జూలై 19వ తేదీ నుంచీ ఆరు నెలల పాటు గడువు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.

కార్మిక హక్కుల కోసం పోరాటాలే శరణ్యం



మీడియాతో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి అన్నారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం పుత్తూరులో జరిగిన సీఐటీయూ 8వ జిల్లా మహాసభల్లో కార్మికులకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై చర్చించామని తెలిపారు. కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను ఏకం చేసి, 8 గంటల పని విధానం అమలు జరిగే వరకు పోరాటాలు చేస్తామని తెలిపారు. టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వేణుగోపాల్, గుణశేఖర్, బుజ్జమ్మ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి: కురుగొండ్ల



గుండెపోటు ఇంజక్షన్‌ను చూపుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ప్రధాన వైద్యాధికారి జిలానీ బాషా ఆస్పత్రి బయట తిరుగుతుండడాన్ని గమనించిన ఎమ్మెల్యే ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు వైద్యం అందించకుండా బయట ఎందుకు ఉన్నారని నిలదీశారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగులకు మొక్కుబడిగా వైద్యం అందించి రెఫర్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకపై అలా జరగడానికి వీల్లేదని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వెంకటగిరిలో త్వరలో డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. గుండెపోటుకు సంబంధించి రూ.45వేల విలువ చేసే అత్యవసర ఇంజెక్షన్లు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తీసువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివారెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ డానియెలీ పరిశ్రమకు పలు అవార్డులు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

సత్యవేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ కన్వర్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (సీఓఓ) పోటీల్లో అత్యున్నత నాణ్యత పనితీరుకు గాను శ్రీసిటీలోని డానియెలీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్, సిల్వర్ అవార్డులను గెలుచుకుంది. దీంతో పాటు విశిష్ట నాయకత్వ ప్రతిభకు డానియెలీ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన సామర్థ్యం, దార్శనికత, నాయకత్వ లక్షణాలకు ఈ అవార్డు వరించింది. ఈసందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ... ఇది శ్రీసిటీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. డానియెలీ సిబ్బంది, యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత డానియెలీ గ్రూపునకు చెందిన శ్రీసిటీలోని డానియెలీ పరిశ్రమ నాణ్యతతో కూడిన స్టీల్ ప్లాంటు మెషినరీ, రోలింగ్ మిల్స్ వంటి పరికరాలను తయారు చేస్తోంది. ఈ విజయంతో శ్రీసిటీ ప్రాంతం వినూత్న పారిశ్రామిక ఆవిష్కరణకు నాయకత్వ కేంద్రంగా ఎదుగుతోందని స్పష్టం చేస్తోంది.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

బాలాయపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బాలాయపల్లిలో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి జీఎస్టీ తగ్గింపు గురించి వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు మాట్లాడుతూ నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రెండు శ్లాబులుగా సంస్కరించిందన్నారు. దీనివల్ల అన్నివస్తువుల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, మద్దూరు కృష్ణ, మావిళ్లపల్లి మాధవ నాయుడు, పులకంటి మురళి, తాళ్ల వెంకటేష్, మారెళ్ల వెంకటాద్రి, గుండుబోయిన గోపాల్, ఆర్కాటి ప్రసాద్, జడపల్లి కోటేశ్వరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిద్దాం: మేరిగ

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ముందుకురావాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీ అన్నారు. మండల పరిధిలోని జరుగుమల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీల్లో బుధవారం కోటి సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, ప్రసాద్‌గౌడ్, కస్తూరయ్య యాదవ్, రాఘవరెడ్డి, సురేంద్ర, జగదీష్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన పెంచుకొంటే నిండు ప్రాణాన్ని రక్షించుకోవచ్చునని ప్రముఖ వైద్యుడు సాయిరాం అన్నారు. బుధవారం స్థానిక విక్రమ్ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అపస్మారస్థితిలోకి వెళ్లిన వారికి సీపీఆర్ చేయడం ద్వారా బతికించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు దవ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణాకుమారి

నాయుడుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యాభ్యాసం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణాకుమారి అన్నారు. బుధవారం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకులు, మంచి నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తారని, విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలన్నారు. జూనియర్లకు సీనియర్లు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ విజయ్‌కుమార్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ఎంఈవో మునిరత్నం అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య పనులపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యలో పారిశుధ్యంపై దృష్టి సారించి పరిస రాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంఈవో వెంట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దుస్తులు, టపాకాయలు, స్వీట్స్ బాక్స్ అందజేశారు. పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించి ఎంఈవో సునీల చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం, ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రశేఖర్, ఉపాధ్యాయులు సుజాత, ఉషారాణి, కళాచిత్ర ట్రస్టు సభ్యుడు ఆర్ఎంస్ భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

నాయుడుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సీఎస్ తేజ సెంటర్‌లో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం గురువారం భూమిపూజ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ రఫీ పర్యవేక్షించారు.

రేకులషెడ్డు నుంచి పడి కూలీ మృతి

చిల్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ రేకులషెడ్డు మీద నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కూలీ మృతిచెంది ఘటన బుధవారం చోటు చేసుకుంది. నెల్లూరు వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన శ్రీహరి (27) చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో లక్ష్మీనారాయణ అనే వ్యక్తి నిర్మిస్తున్న రేకులషెడ్డు వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించినా సాయంత్రానికి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని వర్షం పడింది.



అధ్వానంగా ఉన్న వావిళ్లపాళెం నుంచి తూపిలిపాళెం వెళ్లే రోడ్డు - గుంతలు పడి రాళ్లు తేలిన రావిగుంటపాళెం రోడ్డు

అధ్వాన రోడ్లపై అవస్థల ప్రయాణం

వాకాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వావిళ్లపాళెం నుంచి తూపిలిపాళెం వెళ్లేందుకు మూడు కిలోమీటర్ల రోడ్డులో అరగంట ప్రయాణం చేయాల్సి వస్తోంది. రోడ్డుపై గుంతలుపడి కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తూపిలిపాళెం సమీపంలో పెద్దసంఖ్యలో హేచరీలు, రొయ్యల చెరువులు ఉండడంతో వాహనాలు రాకపోకలతో రోడ్డు అధ్వానంగా తయారైంది. రావిగుంటపాళెం నుంచి నిడిగుర్తి మీదుగా వేణుగోపాలపురం, చిన్నతోట, మనపాళెం, పూడిరాయదొరువు, నవాబుపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరు తేలడంతో 18 కిలోమీటర్ల దూరానికి రెండు గంటలు ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. దుగరాజపట్నం, కొత్తూరు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని వర్షపునీరు చేరడంతో గంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వాకాడు నుంచి వెంకటరెడ్డిపాళెం హరిజనవాడ రోడ్డు దెబ్బతింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

అధికారుల, నాయకుల సమన్వయంతోనే అభివృద్ధి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధికి బాటలు పడతాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొదట విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, వెలుగు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, గృహ నిర్మాణం, ఉద్యానవన శాఖల పనితీరుపై సమీక్షించారు. అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులు, నిర్దేశించిన లక్ష్యాలను వివరించారు. పలువురు నాయకులు తమ పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమన్వయంతో అందరూ కలసి పనిచేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు అభివృద్ధి సాధించడం సులభతరమౌతుందన్నారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని, రెవెన్యూశాఖ ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పెద్దఎత్తున అవగాన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలువురు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణరెడ్డి, తహసీల్దారు పద్మావతి, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, కుందాం, కురుగొండ సొసైటీ చైర్మన్లు పురుషోత్తంరాజు, అంకయ్య, బీసీ, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ఎస్కే ఖలీల్, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, మాచవరం క్లస్టర్ ఇన్‌చార్జి పాదర్తి ప్రకాష్ నాయుడు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఇస్రో మాజీ ఉద్యోగి ఎల్.శ్రీనివాసులు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగానే కాకుండా అరుదైన గొప్ప వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడని కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు సరికొత్త దిశను చూపించారని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకుపోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులచే సైన్సు ప్రాజెక్టులు ఏర్పాటు చేసి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, షార్ మాజీ ఉద్యోగి శ్యామ్ సుందర్, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు ఉస్మాన్ బాషా, దుష్యంత్, శ్రీకుమార్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక జనసేన కార్యాలయంలో అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కలలు కనండి... వాటిని సాకారం చేసుకోండి అని యువతకు గొప్పసందేశాన్ని అందించిన మహానుభావుడని, ఆయన సూచించిన మార్గంలో యువత నడుస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున, వంశీకృష్ణ, సాయికిరణ్, విజయ్, శ్రీను, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు సురక్షా యాప్

సూళ్లూరుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సురక్షా యాప్ అందుబాటులోకి తెచ్చిందని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలిపారు. బుధవారం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించి సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. మద్యం బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తరువాత అమ్మకాలు కొనసాగించాలని ఆదేశించారు. ఈ యాప్ ద్వారా స్కాన్ చేసి మద్యం తయారీ కంపెనీ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ అరుణకుమారి అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కల్తీ మద్యాన్ని నిర్మూలించడంలో భాగంగా ఎక్సైజ్ సురక్ష యాప్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. మద్యం దుకాణాల్లో ప్రతి మద్యం సీసాను యాప్ ద్వారా స్కాన్‌చేసి మాత్రమే విక్రయించాలని ఆదేశించడం జరిగిందన్నారు.


ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన

వాకాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల మద్యం దుకాణ నిర్వాహకులకు ఎక్సైజ్ సురక్ష యాప్‌పై సీఐ ప్రసాద్ అవగాహన కల్పించారు. కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఆవిష్కరించిందన్నారు. మద్యం విక్రయించేటప్పుడు ప్రతి బాటిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేసి అమ్మకాలు జరపాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మ సాగుపై రైతులకు అవగాహన

గూడూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపాళెం గ్రామంలో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిమ్మ సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో డాక్టర్ తిరుపాల్, సునీత, గోపినాయక్, మణికంఠస్వామి, ప్రసాద్, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

పేటశ్రీ 'తిరుపతి కథలకు' తెలుగు వర్సిటీ పురస్కారం



పేట శ్రీనివాసులురెడ్డి - తిరుపతి కథలు పుస్తకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేట శ్రీనివాసులురెడ్డి రాసిన 'తిరుపతి కథలు' పుస్తకానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఏటా ఈ అవార్డులను ప్రకటిస్తారు. 2023 సంవత్సరానికి గాను వచనరచనల విభాగంలో పేట శ్రీనివాసులురెడ్డికి ఈ పురస్కారం లభించింది. ఈనెల 29వ తేదీన హైదరాబాదు నాంపల్లిలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు. ఎస్వీయూ తెలుగు విభాగం రిటైర్డు ప్రొఫెసర్ అయిన ఈయన 2014లోనూ తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఇప్పటికే 20 పురస్కారాలను అందుకున్న పేటశ్రీ 25 పుస్తకాలు, 300 వ్యాసాలు రాశారు. 10 దేశాల సదస్సుల్లో పాల్గొన్నారు.

పోక్సో కేసులో రిమాండ్

బాలాయపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. నిందితుడిని వెంకటగిరి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి డిమాండ్

తిరుపతి(జీవకోన), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి చాటుకోవాలని మాజీ మంత్రి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. తిరుపతిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కిందిస్థాయి కార్యకర్తలతో ప్రభుత్వాన్ని నడిపేలా జగన్‌మోహన్‌రెడ్డి సందేశం ఇచ్చారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి జగన్, పెద్దిరెడ్డే అంతా చేశారని తాను సిట్ విచారణలో చెప్పలేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. అనంతరం భూమన నివాసం వద్ద రోడ్డుపై బైఠాయించి మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలంటూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలోనూ ప్రభుత్వంపై పెద్దిరెడ్డి, భూమన విమర్శలు చేశారు. టీడీపీలో తమకెవరూ కోవర్టులు లేరని చెప్పారు.



ధర్నాలో పెద్దిరెడ్డి, భూమన తదితరులు

గూగుల్‌తో ఒప్పదం.. రాష్ట్రాభివృద్ధిలో కీలక మలుపు



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పదం కుదుర్చుకోవడం రాష్ట్రాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో కీలక మలుపు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంతో గుర్తింపు పొందిన గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేసేలా మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రంలోని 2 లక్షల మంది యువతకు ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకపాలనను తట్టుకోలేక రాష్ట్రంలో ఉన్న పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోవడం జరిగిందన్నారు. సమర్థత కలిగిన నాయకత్వం ఉంటే ఏదైనా సుసాధ్యం చేయవచ్చునని ఎన్డీఏ ప్రభుత్వం చేసి చూపుతోందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచురామయ్య, చంద్రమౌళి, గుండాల లీలావతి, ఇశ్రాయిల్ కుమార్, పెంచలయ్య, వెంకటేశ్వర్లురాజు, వేముల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీభారత్ ట్రస్టు సేవలు అభినందనీయం



వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొమారి కోటేశ్వరరావు

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటకు చెందిన శ్రీభారత్ ట్రస్టు సేవలు అభినందనీయమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో బుధవారం శ్రీభారత్ ట్రస్టు చైర్మన్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. కోట, వాకాడు మండలాల్లోని గోవిందపల్లిపాళెం, తూపిలిపాళెం, కొండూరుపాళెం గ్రామాల్లో 3 విద్యావికాశ కేంద్రాలు శ్రీభారత్ ట్రస్టు ద్వారా నడుస్తున్నాయని, ఈ నెలలో మరో రెండు పాఠశాలలు ప్రారంభించనున్నట్లు కోటేశ్వరరావు వెంకయ్యనాయుడుకి తెలిపారు. పేదలకు ఉచిత విద్య, ఆరోగ్యం, పర్యావరణం, రైతు వికాసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలు పేదలకు అందేలా శ్రీభారత్ ట్రస్టు చేస్తున్న కృషిని వివరించారు.

సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అని వాకాడు ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. కోటలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం యూరియా కార్డులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 34 టన్నుల యూరియా, 43.5 టన్నుల పోటాష్ అందుబాటులో ఉందన్నారు. ఎకరా పొలానికి విడతలవారీగా మూడు బ్యాగుల యూరియా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్ర ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కోటారెడ్డి, మధుయాదవ్, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా



రైతులకు యూరియా బస్తాలు అందజేస్తున్న వేనాటి శ్రీకాంత్‌రెడ్డి

తడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని తడ పీఏసీఎస్ చైర్మన్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ జరిగింది. చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు మొదలవుతున్నాయన్నారు. రైతులకు అందించేందుకు 2,200 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు రవి, సుధాకర్, సీఈవో రామయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. ముందుగా కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్లు సురేష్, పవన్‌కుమార్, ఏవో మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లాను కలిసిన సంచి కృష్ణయ్య



పెళ్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డిలను పెళ్లకూరు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేతలను ఆయన కలిశారు.

ఇప్పతాంగాళ్‌లో వైద్యశిబిరం


జ్వరపీడితులను పరీక్షిస్తున్న వైద్య బృందం

నారాయణవనం, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పతాంగాళ్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం ఆంధ్ర జ్యోతి దినపత్రికలో 'జ్వరాల బారిన గ్రామీణులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. కళింమిట్ట పంచాయతీ ఇప్పతాంగాళ్‌లోని సీహెచ్‌ఓ మోహన్ బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ యశోద, వరలక్ష్మి పర్యవేక్షణలో వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులను పరీక్షించి మందులనుపంపిణీ చేశారు. అలాగే గ్రామంలో నిల్వ ఉన్న చెత్తచెదారాలను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. గ్రామంలోని మురుగు నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. దోమల మందులను పిచికారీ చేశారు. అనంతరం జ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలను గ్రామస్తులకు వివరించారు. సుధాకర్, ఇందుమతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

● పనికి తీసుకెళ్లిన వ్యక్తిపై మండి పడుతున్న మృతుడి కుటుంబీకులు


శ్రీరాములు (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోబాక గ్రామానికి చెందిన దుర్వాసులునాయుడు ఎస్‌ఆర్‌పురం మండలంలో పొలాలున్నాయి. అక్కడి రైతు సేవా కేంద్రం వద్ద యూరియా తీసుకోవడానికి మోదుగులపాళెం దళితవాడకు చెందిన కె.శ్రీరాములు అలియాస్ వెంకటయ్య(55)తో పాటు మరి కొందరిని ఆటోలో తీసుకెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం సేవా కేంద్రం వద్ద భోజనం తినేందుకు చేతులు కడుక్కోవడానికి కొళాయి వద్దకు వెళ్లాడు. విద్యుదాఘాతంతో పడిపోయాడు. సహచర కూలీలు గుర్తించి దుర్వాసులు నాయుడికి చెప్పడంతో ఆయన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్సు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని శ్రీరాములును పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించి వెళ్లిపోయారు. శ్రీరాములు మృతదేహాన్ని మోదుగులపాళెంలోని ఆయన ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయాడు. పనికి తీసుకెళ్లి మృతదేహాన్ని అప్పగిస్తావా అని దుర్వాసులునాయుడుపై శ్రీరాములు కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా శ్రీరాములుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చెకుముకి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రేణిగుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లాబక్ష్, కుప్పస్వామి మాట్లాడుతూ నవంబరు 1న మండలస్థాయి, 23న తిరుపతి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగులో సాంకేతికతను అవలంబించండి

రేణిగుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో నూతన సాంకేతికతను అవలంబించాలని ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ జేవీరమణ అన్నారు. మండలంలోని చైనత్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఆత్మ సహకారంతో బుధవారం నిర్వహించిన కిసాన్ మేళాలో పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, ప్రభుత్వ రాయితీలు, అధిక పాలు, మాంసం ఉత్పత్తినిచ్చే పశు జాతుల గుర్తింపు, యాజమాన్యం తదితర అంశాలను వివరించారు. విత్తనాలు, నారు మొక్కలు, జీవన ఎరువులు, కోడి పిల్లలు, ఔషధ మొక్కలు రైతులకు పంపిణీ చేశారు. అగ్రికల్చర్ వర్శిటీ విస్తరణ సంచాలకురాలు శోభమణి, ప్రాంతీయ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ సుమతి, సహ సంచాలకురాలు డాక్టర్ రూత్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

సోషల్ మీడియాకే స్పందన

● సమస్య పరిష్కరిస్తున్న మున్సిపల్ అధికారులు


రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు - నీటిని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

పుత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ అధికారులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. ప్రజలు నేరుగా సమస్యలపై ఫిర్యాదులు చేసినా స్పందించరు... సోషల్ మీడియాలో పోస్టు చేయగానే గంటలో పరిష్కరిస్తున్నారు. బుధవారం ఉదయం ఈ సలాపురం సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ విషయమై ఓ వ్యక్తి రోడ్డుపై వర్షపు నీరు నిలువ ఉండటంతో పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారని వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. దీంతో వెంటనే స్పందించిన మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని నీటిని తొలగించారు. సోషల్ మీడియాలో వస్తున్న సమస్యలపై స్పందిస్తున్న అధికారులు ప్రజలు నేరుగా వచ్చి చెప్పుకున్న ఇబ్బందుల విషయంలో అంతే చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ఇకపై ప్రజలు సమస్యల పరిష్కారం కోసం సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న రెడ్డెప్ప నాయుడు

పుత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో పనిచేసే సమయంలో కార్మికులు కళ్లద్దాలు, హెల్మెట్, గ్లౌస్ వంటి భద్రతా పరికరాలు తప్పని సరిగా ఉపయోగించాలని అమరరాజా ఇండస్ట్రీస్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం మేనేజర్ రెడ్డెప్ప నాయుడు చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిశ్రమల్లో యంత్రాలు, రసాయనాలు, విద్యుత్ పరికరాలు వినియోగించే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఈకారణంగా పరిశ్రమల్లో పని చేసేటప్పుడు భద్రతా ప్రమాణాలు పాటించడం ప్రతి కార్మికుడి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పీడీ ఆకస్మిక తనిఖీలు


సమావేశంలో ప్రసంగిస్తున్న వసంతాబాయి

పుత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకురాలు వసంతాబాయి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సీడీపీవో, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. పీడీ స్వయంగా 0-5 సంవత్సరాల పిల్లలకు బరువు, ఎత్తులను ఎలా కొలవాలి, వారి పోషణస్థితిని ఎలా నిర్వహించాలో సిబ్బందికి చేసి చూపారు. ప్రతి బిడ్డా ఆరోగ్యంగా ఉండడానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం తిరుపతి జిల్లాలోని సీడీపీవోలతో పుత్తూరు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఎదుగుదల అంశంపై చర్చించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరు చేతుల 20 సెకన్ల పాటు సోపుతో చేతులు కడుక్కోవాలని సూచించారు.

జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటా అవగాహన



పుత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్ర జ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సక్సెస్ అంశంపై పుత్తూరు పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ విస్తృతంగా అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక గేట్ వీధిలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ జీఎస్టీ తగ్గింపు, ప్రయోజనాలను వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు అన్నశన్, వార్డు అధ్యక్షుడు ఎన్.ఎస్.గోపాల్, ఎన్.ఎం.ఆర్ముగం, చిన్నప్పన్, జయవేళన్, మోహన్, అశోక్ పాల్గొన్నారు.

బ్రీత్ అనలైజర్ పరీక్షలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీసులు బుధవారం వాహనదారులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఆర్ఎస్ సీహెచ్ గోవిందు మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు.

ఆరోగ్య కేంద్రం రోడ్డుకు మోక్షం

● రూ.26లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభం


ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు చదును పనులు

రేణిగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డుకు మోక్షం లభించింది. గుంతల మయంగామారిన ఈ రోడ్డులో ప్రయాణం కష్టంగా మారిన వైనంపై ఈనెల 6న 'గోతులమయంగా పీహెచ్‌సీ రోడ్డు' శీర్షికన ఆంధ్ర జ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అన్నా స్వామిపల్లి వరకు 1.9 కిలోమీటర్లకు రూ.26 లక్షల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ఈక్రమంలో బుధవారం నూతన రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఎన్నో ఏళ్లగా సమస్యగా మారిన గుంతల రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల తలుపులు పగలగొట్టి పరికరాల ధ్వంసం



కేవీబీపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు ప్రాథమిక పాఠశాల తలుపులు పగులగొట్టి విద్యార్థులు వినియోగించే పరికరాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన బుధవారం ఉదయం వెలుగు చూసింది. మంగళవారం సాయంత్రం పాఠశాల పూర్తయిన తరువాత ఉపాధ్యాయులు, సిబ్బంది యధావిధిగా తలుపులకు తాళాలు వేసుకుని వెళ్లారు. మంగళవారం రాత్రి కొంతమంది ఆకతాయిలు ప్రహరీ దూకి పాఠశాల తలుపులు పగులగొట్టి లోపలకు చొరబడ్డారు. విద్యార్థులకు వినియోగించే పరికరాలను ధ్వంసం చేశారు. ఉదయం పాఠశాలను శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్ విషయాన్ని గుర్తించి గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు మలయాళస్వామి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ఏర్పేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు మలయాళస్వామి విగ్రహ ఏర్పాటుకు ఆశ్రమ పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. ఏర్పేడులోని వెంకటగిరి బైపాస్ క్రాస్ వద్ద విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం 7.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాల సమయానికి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

వర్మీ కంపోస్టు ఎరువును సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు ఎరువును రైతులు, గృహస్తులు, మహిళలను సద్వినియోగం చేసుకోవాలని ఆమందూరు పంచాయతీ కార్యదర్శి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆమందూరు బృందావనంలో వానపాముల ఎరువు అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. రైతులు పంటలలో వినియోగించేందుకు, మహిళలు, గృహిణులు పెరటి తోటల పెంపకానికి ఈ ఎరువులను ఉపయోగించుకోవాలని కోరారు. 20కిలోల వర్మీ కంపోస్టు రూ.600కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. బృందావనం వద్ద 2,500 కిలోల ఎరువు అందుబాటులో ఉందని సర్పంచ్ బి. బాల గురునాథంయాదవ్ తెలిపారు.

ఎంజీఎంలో చిత్రలేఖనం పోటీలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం విద్యాసంస్థల్లో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో జూనియర్ ఎంపీసీకి చెందిన లిఖిత, సీనియర్ బైపీసీకి చెందిన ధనుశ్రీ, జూనియర్ ఎంఈసీకి చెందిన మీనాక్షి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుద్లూరు ఐశ్వర్య బహుమతులు ప్రదానం చేశారు. ఇలాంటిమరెన్నో పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.ఎస్. రత్నం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుయువత నాయకుడు వంకాయల సిద్ధులయ్యను ఆయన ఇంట్లో బుధవారం ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి పరామర్శించారు. అలాగే మాజీ కౌన్సిలర్ అనిత తల్లికి ఇటీవల గుండె శస్త్రచికిత్స చేశారు. ఆమెను కూడా పరామర్శించారు. టీడీపీ నాయకులు దుర్గాప్రసాద్, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా 107వ సమాధి దినం

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట జయసాయి ట్రాక్టర్ స్పేర్‌పార్ట్స్ దుకాణం వద్ద బుధవారం షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా 107వ సమాధి దినాన్ని నిర్వహించారు. ముందుగా బాబా చిత్రపటానికి పూజలు చేసి అనంతరం భజన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జగదీష్‌రెడ్డి, మునస్వామి, రాముగుప్తా, రాజా, జయకుమార్, సునీల్, రమణకవి, గరికపాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్


సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణయ్య

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్య కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందు వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం పర్యావరణ పరిరక్షణలో చేపడుతున్న ఆలయ పరిసరాలనుంచి వెలువడే వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారుచేసే యంత్రాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవోలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బాణసంచా విక్రేత అరెస్టు

రూ.5లక్షల టపాకాయల సీజ్


గోడౌన్‌పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా బాణసంచా విక్రయిస్తున్న అనిల్ అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేయడంతో పాటు నిల్వ ఉంచిన రూ.5లక్షల విలువైన టపాసులను సీజ్ చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు గ్రామ శివార్లలో అనిల్ అనే యువకుడు గోదాములో అక్రమంగా బాణసంచా నిల్వ చేశాడు. సామాజిక మాధ్యమాల ద్వారా తక్కువ ధరకు టపాకాయలు విక్రయిస్తానంటూ ప్రచారం చేశారు. ఈ మేరకు విక్రయాలు సాగించాడు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహార్తి, రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అక్రమ బాణసంచా విక్రయాలపై నిఘా పెట్టారు. బుధవారం రాత్రి గోదాముపై దాడి చేసి అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. రూ.5లక్షలు విలువైన టపాసులను సీజ్ చేసినట్లు తెలిపారు.

తారాజువ్వ పేలి ఒకరికి గాయాలు

యువకుడికి తీవ్రగాయాలు


ప్రథమ చికిత్స పొందుతున్న సల్మాన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియల్లో తారాజువ్వ చేతిలో పేలడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన సల్మాన్(21) శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సమీపంలోని ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తుంటాడు. సహచర కార్మికుడి కుటుంబసభ్యుడు మృతి చెందటంతో శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్టలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియలకు సల్మాన్ హాజరయ్యాడు. ఇందులో భాగంగా తారాజువ్వను చేతిలో పట్టుకుని కాల్చే క్రమంలో అది పేలిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితులు ఆయన్ను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరించారు. ప్రథమ చికిత్స అనంతరం రుయాకు తీసుకెళ్లారు.

కొట్టేసాయికి సన్మానం



వరదయ్యపాళెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ కొట్టే సాయిని ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు గుత్తి త్యాగరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొట్టేసాయిని ఆలయంలోని చైర్మన్ కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు.

ఎఫ్‌ఏ 2 పరీక్షల పరిశీలన

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన ఎఫ్‌ఏ-2 పరీక్షలను బుధవారం ఎంఈవో 2 మునిసుబ్రమణ్యం పరిశీలించారు. బుచ్చినాయుడు కండ్రిగ, నీర్పాకోట, కనమనంబేడు, పాఠశాలల్లో తనిఖీ చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆగస్టు, సెప్టెంబరు నెలల పాఠ్యాంశాలపై పూర్తి స్థాయిలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. వాటికి అనుగుణంగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌ఏ 1 పరీక్షలు పూర్తయాయ్యయని, అందులో వచ్చిన మార్కులను బట్టి విద్యార్థుల సామర్థ్యాలు తెలుస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దర్మరణం


ప్రశాంత్ (ఫైల్)

శ్రీకాళహస్తి/ వెంకటగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... మేరకు శ్రీకాళహస్తి మండలం పాపనపల్లికి చెందిన ప్రశాంత్ అలియాస్ మణికంఠ(21), పవన్ (22) రోజువారి కూలీలు. సొంతపనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై ఇద్దరు వెంకటగిరి పట్టణానికి వెళ్లారు. రాత్రి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో శ్రీకాళహస్తి మండలం ఆంజనేయపురం వద్ద వెంకటగిరి - ఏర్పేడు రహదారిపై ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రశాంత్ దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన పవన్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరించారు. సమాచారం తెలుసుకున్న సీఐ గోపి రూరల్ పోలీసులను అప్రమత్తం చేశారు. హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పవన్ కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి విషమంగా మారింది. ఆయనకు ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

గూగుల్ ఏర్పాటు రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం టీఎన్‌ఎస్‌ఎఫ్

సత్యవేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో రూ.1.36 లక్షల కోట్లతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కావడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు విజన్‌తో ఐటీ, ఏఐ, డేటా సెంటర్‌కు విశాఖ హబ్‌గా మారనుందని పేర్కొన్నారు. విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్‌తో సుమారు 2 లక్షల ఉద్యోగాలు రానున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక అదృశ్యం

కేసును ఛేదించిన పోలీసులు

వరదయ్యపాళెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం పంచాయతీ విఠలయ్యపాళెం ఎస్టీ గిరిజన కాలనీలో ఏడేళ్ల చిన్నారి అదృశ్యం కాగా గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాలు... విఠలయ్యపాళెం ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం, ధన దంపతుల కుమార్తె తులసి (7) గత ఆదివారం ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు పలు చోట్ల వెదికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మధ్యాహ్నం వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు తడ రైల్వేస్టేషన్ వద్ద బాలిక ఉందన్న సమాచారం మేరకు బాలికను పట్టుకున్నారు. కాగా ఆదివారం సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చిన సూళ్లూరుపేట మండలం అండగుండాల గ్రామానికి చెందిన స్నేహితుడైన ఓ వ్యక్తి బాలికను అపహరించుకుని వెళ్లినట్లు సమాచారం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

బత్తలవల్లంలో వ్యాక్సినేషన్

వరదయ్యపాళెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లంలో హెల్త్ సూపర్‌వైజర్ పవనకుమారి ఆధ్వర్యంలో బుధవారం వ్యాక్సినేషన్ నిర్వహించారు. గ్రామంలోని చిన్నారులకు రోగ నిరోధక టీకాలు వేసి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం కవిత, ఎంఎల్‌హెచ్ నిఖిల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల వితరణ


నోటు పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో

వరదయ్యపాళెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవారి పాళెం ప్రాథమిక పాఠశాలలో బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. బుధవారం దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పాఠశాలలో ఎంఈవో సరస్వతి చేతుల మీదుగా 45 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రియాజ్, అబ్దుల్లా, పాఠశాల హెచ్‌ఎం మునీశ్వరి, ఉపాధ్యాయులు శశికుమార్, రుష్యేంద్ర, సుజాత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ స్పెషలాఫీసర్ పదవీకాలం పొడిగింపు

తిరుపతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపాలిటీ స్పెషలాఫీసర్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరగని కారణంగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి అక్కడి ఆర్డీవోను స్పెషలాఫీసర్‌గా నియమించింది ప్రభుత్వం. చివరగా ఈ ఏడాది జనవరి 29న ప్రభుత్వం స్పెషలాఫీసర్ పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించింది. ఆ గడువు గత జూలై 18వ తేదీన ముగిసింది. దీంతో ఎస్వో పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని కోరుతూ గత నెల 20న మున్సిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దానిపై స్పందించిన మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ గత జూలై 19వ తేదీ నుంచీ ఆరు నెలల పాటు గడువు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.